ట్రాఫిక్ సమస్యతో సతమతం

- నగరంలో భారీగా పెరుగుతున్న వాహనాల సంఖ్య
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న నగర వాసులు

గుణదల(విజయవాడతూర్పు): నగరంలో రోజు రోజుకు పెరుగుతున్న వాహనాలతో ట్రాఫిక్ సమస్య నానాటికీ జటిలమవుతోంది. ప్రతి నిత్యం పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో నగర పరిధిలోని పలు ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. ఈ సమస్యకు పరిష్కారంగా పోలీసులు చేపడుతున్న చర్యలు ఒకింత సత్ఫలితాలనిచ్చినా ప్రయాణికులకు మాత్రం తిప్పలు తప్పడం లేదు.



బందరు రోడ్డులో నిలిచిన వాహనాలు

వాహనం అనివార్యం..

గతంతో పోలిస్తే నగరంలో వాహనాల సంఖ్య పెరిగిందనే చెప్పాలి. అన్ని వర్గాల ప్రజలు ప్రస్తుతం ద్విచక్ర వాహనాలు వినియోగిస్తున్నారు. సమయానికి గమ్య స్థానాలను చేరుకునేందుకు బైక్‌ల వాడకం అనివార్యమైంది. విద్యార్థులు, మహిళలు సైతం ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాలను తమ వ్యక్తిగత ప్రయాణాల కోసం కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లపై సైతం రాకపోకలు పెరిగాయి. దీంతో రోడ్లపై ట్రాఫిక్ సమస్య నానాటికీ పెరిగిపోతోంది.

ప్రధాన కూడళ్ల వద్ద నరకమే..

నగరంలో ప్రధాన రహదారులుగా ఉన్న ఏలూరు రోడ్డు, బందరు రోడ్డు, ఐదో నంబర్ రోడ్లు వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటున్నాయి. ఆయా ప్రాంతాల్లో ప్రధాన కూడళ్లు, సిగ్నల్స్ వద్ద ఈ సమస్య మరింత అధికంగా మారింది. ముఖ్యంగా బెంజిసర్కిల్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు ఉన్న జాతీయ రహదారిలో ప్రయాణించాలంటే వాహన చోదకులకు సవాలుగా మారింది. సిగ్నల్స్ పడినప్పుడు వందలాది వాహనాలు బారులుతీరి ప్రయాణికులకు నరకంగా మారుతోంది. ప్రభుత్వాస్పత్రి కూడలి, రమేష్ ఆస్పత్రి రింగ్ రోడ్డు, రామవరప్పాడు రింగ్ వంటి ప్రధాన కూడళ్ల వద్ద బస్సులు, లారీలు, ఆటోలు బారులు తీరిన పరిస్థితి ఏర్పడుతోంది.

పోలీసుల అవస్థలు..

ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణ కోసం పోలీసులు నానా అవస్థలు పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో సిగ్నల్స్ వద్ద ఇటీవల మైక్‌ల ద్వారా ప్రయాణికులకు సూచనలు ఇస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, ముఖ్య అధికారులు, రాజకీయ నాయకుల కాన్వాయ్‌లు వచ్చిపోయే సమయంలో పోలీసులపై మరింత భారం పడుతోంది. దీనికి తోడు తమ గమ్యస్థానాలకు త్వరగా వెళ్లాలనే తొందరలో మితిమీరిన వేగంతో వాహన చోదకులు ప్రయాణించడం పోలీసులకు తలనొప్పిగా మారింది. ప్రయాణికుల సౌకర్యార్థం పోలీసులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్నా కొందరు వీరి కళ్లుగప్పి నిబంధనలు అతిక్రమిస్తున్నారు. వారిపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రయాణికులు తమకు సహకరించాలని పోలీసులు కోరుతున్నారు.

పోలీసులు చర్యలు తీసుకోవాలి..

జాతీయ రహదారి వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. ఎన్టీఆర్ యూనివర్సిటీ వద్ద ప్రతినిత్యం వందలాది వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు, వాహనాల మళ్లింపు విషయంలో పోలీసులు దృష్టి సారించాలి. కేవలం హెల్మెట్‌ల పైనే దృష్టి సారించి ఫైన్లు వేయడానికే పరిమితం కాకుండా ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– జి.రామరాజు, స్థానికుడు, గుణదల

సేవా కార్యక్రమాల్లో రోటరీ ముందంజ



లబ్బీపేట(విజయవాడతూర్పు): సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో రోటరీ క్లబ్‌లు ముందంజలో ఉన్నాయని రోటరీ జిల్లా గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ సభ్యుల సమావేశంలో ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. అనంతరం కైలాస వైకుంఠ వాహనాన్ని(మహాప్రస్థానం) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతిమ యాత్ర ఎలాంటి ఇబ్బందులు పడకుండా జరుపుకోవాలని, అందుకోసమే రోటరీ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో వాహనాన్ని ప్రారంభించామన్నారు. రోటరీ సేవా కార్యక్రమాల్లో భాగంగా గర్భాశయ క్యాన్సర్‌ను నివారించడానికి హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేస్తున్నామని చెప్పారు. మిడ్‌టౌన్ అధ్యక్షుడు గుడిపాటి కిశోర్ మాట్లాడుతూ.. తుమ్మలపల్లి కళాక్షేత్రం పక్కన ఉన్న వీరబాబు దేవస్థానానికి రూ.2 లక్షల విలువ చేసే వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. క్లబ్ కార్యదర్శి సుందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, డిస్ట్రిక్ అడ్వైజర్ యడ్ల పార్థసారథి, గద్దం రవికుమార్, క్లబ్ ప్రతినిధులు మధు, తొండేపు ఉదయ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎస్ఎన్‌పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు సత్ప్రవర్తనతో ఉండాలని, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సత్యనారాయణపురం ఎస్ఐ షబ్బీర్ హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు, క్రైమ్ సస్పెక్ట్ షీటర్లపై పోలీసుల నితరంతర నిఘా ఉంటుందని తెలిపారు. మంచి నడవడితో కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలని సూచించారు. ఒకవేళ ఏదైనా చట్టవ్యతిరేక చర్యలకు ప్పాడినట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఉమెన్ ఎస్ఐ సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ కనకదుర్గానగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పీ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగ్‌నగర్ 58వ డివిజన్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీ, నూకాలమ్మ గుడి, సెయింటాన్స్ స్కూల్ రోడ్, స్పైల్ హాస్పిటల్ రోడ్, ఆంధ్రపత్రిక కాలనీ, వశిష్ఠ కాలనీ, ఆంధ్రప్రభకాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. కావున ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఉగ్రవాదుల దుశ్చర్యను ఖండించిన జమ్‌యియ్యత్ అహ్లెహదీస్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జమ్‌యియ్యత్ అహ్లెహదీస్ రాష్ట్ర కమిటీ కశ్మీర్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించింది. మృతులకు సంతాపం తెలిపింది. విజయవాడ నగరంలోని ఆ సంస్థ రాష్ట్ర కార్యాలయంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు ఫజల్‌రెహ్మాన్, అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ఉగ్రవాదాలు దుశ్చర్యలను తమ సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఉగ్రవాదానికి మతం ఉండదని ఉగ్రవాదులు పశువుల కన్నా హీనమైన వారని చెప్పారు. ఇస్లాంలో ఒక వ్యక్తిని చంపితే సమస్త మానవుల్ని చంపినట్లుగా ఉందన్నారు. అటువంటిది, ఈ దుర్మార్గపు చర్యకి పాల్గొనడం చాలా నీచమైన చర్యగా వారు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదుల మీద కఠినమైన చర్య తీసుకొని వారిని అంతమొందించాలన్నారు. రాబోయే రోజుల్లో ఇటువంటి చర్య జరగకుండా చూడాలని కోరారు. సమావేశంలో సంఘ రాష్ట్ర కోశాధికారి ఫారుఖ్‌ఖాన్, రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

భార్యపై భర్త దాడి

పాయకాపురం(విజయవాడరూరల్): పుట్టింటి వద్ద ఉంటున్న భార్యను కొట్టి ఆమె మెడలో ఉన్న బంగారు నానతాడు తీసుకెళ్లిన భర్తపై నున్న పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. పశ్చిమ గోదావరి జిల్లా కామవరపుకోట మండలం తడికలపూడి గ్రామానికి చెందిన మెట్టకాయల శ్రీదేవి, ఆమె భర్త రాంబాబు 25 సంవత్సరాలుగా రాజీవ్‌నగర్ ఉడాకాలనీలో మెడికల్‌షాపు నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవల రాంబాబు మానసిక స్థితి సరిగా లేక తరుచూ భార్యతో గొడవ పడటం, మానసికంగా ఆమెను వేధిస్తున్నాడు. దీంతో ఆమె నెల రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే ఈ నెల 26వ తేదీన రాంబాబు తన భార్యను కొట్టి ఆమె మెడలో ఉన్న బంగారపు నానతాడును తీసుకువెళ్లాడు. ఈ ఘటనపై శ్రీదేవి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

హరివిల్లు ఫౌండేషన్ మజ్జిగ వితరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): హరివిల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యాధరపురం సితార జంక్షన్‌లో మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.శశికాంత్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా వేసవి కాలం పాటు ప్రతి ఆదివారం నగరంలోని ఒక ప్రధాన కూడలిలో తమ ఫౌండేషన్ ద్వారా దాహార్తులకు చల్లటి మజ్జిగ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్ కుమార్, కార్యవర్గ సభ్యురాలు ఎం.శ్రీదేవి సీనియర్ సభ్యులు బాలసూర్యనారాయణ, ఉపాధ్యక్షులు ఎస్‌కే మహమ్మద్ రఫీ, సభ్యులు ఎంవీఎస్ఎన్ ప్రసాద్, షేక్ హబీబ్ బాషా, గురురాజ్, పి.త్రినాథ్, నజీర్ మొహమ్మద్, కె.శ్రీనివాసరావు, పాలొన్నారు.

నేత్ర పర్వంగా సాగిన సంప్రదాయ నృత్యోత్సవం



నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారిణులు



చిన్నారుల నృత్య ప్రదర్శన



విజయవాడ కల్చరల్: అంతర్జాతీయ నృత్యదినోత్సవం సందర్భంగా దృశ్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో ఆదివారం నాట్యాచార్యులు, చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు నేత్ర పర్వంగా సాగాయి. నగరానికి చెందిన నాట్యాచార్యులు గోనుగుంట్ల శైలశ్రీ నృత్యనిలయం, పద్మశ్రీ హేమంత్ భారతీయ నృత్యనిలయం, డాక్టర్ ఉషా మాధవి సిరిమువ్వ నృత్యనికేతన్, డాక్టర్ సీహెచ్ అజయ్‌కుమార్ హంసధ్వని కూచిపూడి నృత్యాలయం, సంతోష్ శ్రీ శారదా నృత్యపీఠం, యల్లాజోస్యుల అనూరాధ శారదా నృత్యనిలయం, యువ నాట్యకళాకారులు ఎమ్ లేఖ్యాభరణి, సీ సిరి శృతి సమన్విలు తమ బృందాలతో 70 మంది కళాకారులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా నాట్యాచార్యులు వేదాంతం పాండురంగశర్మ, గోనుగుంట్ల సత్యానందినిలను ఆత్మీయంగా సత్కరించారు.

దేశ గౌరవాన్ని చాటుతున్న నృత్యాలు

కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హ్యాపీ రిసార్ట్స్ అధినేత అంబటి మధుమోహన కృష్ణ మాట్లాడుతూ నాట్యాచార్యులు సంప్రదాయ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. కూచిపూడి, భరతనాట్యం, కథక్, కథాకళి, ఒడిస్సీ నృత్యాలు మన దేశ గౌరవాన్ని ప్రపంచానికి చాటిచెపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దృశ్యవేదిక సభ్యులు హెచ్‌వీఆర్ ప్రసాద్, దొంతాల ప్రకాష్, నరేన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని బత్తుల రూపాశ్రీ నిర్వహించారు.

గ్రామ ఉద్యాన సహాయకులకు వెసులుబాటు కల్పించాలి

ఉద్యాన సహాయకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న గ్రామ ఉద్యాన సహాయకుల సంక్షేమ సంఘం నాయకులు

గాంధీనగర్(విజయవాడ): గ్రామ ఉద్యాన సహాయకులను సచివాలయం శాఖలో పనిచేసుకునే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని ఉద్యాన సహాయకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాణోతు నాగరాజు కోరారు. గ్రామ ఉద్యాన సహాయకుల సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ గ్రామ ఉద్యాన సహాయకులకు జాబ్‌చార్ట్ ప్రకారం మాత్రమే విధులు నిర్వహించేలా చూడాలని అన్నారు. గ్రామ ఉద్యాన సహాయకులను ఉద్యాన పంటల విస్తీర్ణం ప్రతిపాదికన ఉద్యాన అధికారి పర్యవేక్షణలో విధులు నిర్వహించే విధంగా మ్యాపింగ్ చేయాలన్నారు. ఆరు సంవత్సరాలుగా ఉద్యాన సహాయకులకు బదిలీలు, ప్రమోషన్‌లు ఇవ్వకుండా ఉండటం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. విధుల్లో వెసులుబాటు కల్పించి గ్రామ ఉద్యాన సహాయకులకు ప్రమోషన్‌లకు అవకాశం కల్పించాలని కోరారు. గతంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రాలు అందజేసినప్పటికీ వారి నుంచి స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకుల సంక్షేమ సంఘాల జేఏసీ జనరల్ సెక్రటరీ సురేంద్ర, ఉపాధ్యక్షుడు మురళీ చంద్రయ్య, కోశాధికారి ఆంజనేయులు, ఉద్యాన సహాయకులు దుర్గాప్రసాద్, సుబ్రహ్మణ్యం, దీక్ష, శమీమ్, భరత్, మనోజ్ పాల్గొన్నారు.

నేటి నుంచి గంగానమ్మ తిరునాళ్ల

నున్న(విజయవాడరూరల్): నున్న బోడపాడు గ్రామంలో వేంచేసియున్న గంగానమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు సోమవారం నుంచి శుక్రవారం వరకు జరుగుతాయని నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5గంటల నుంచి అమ్మవారి సుప్రభాతం, ఆలయశుద్ధి, నిత్యార్చన, గణపతి పూజ, పుణ్యాహవాచన, అఖండ దీపారాధన, కలశస్థాపన, అంకురార్పణ, అనంతరం మాను పూజ మేళతాళాలతో అమ్మవారికి గ్రామ పసుపు, కుంకుమ సమర్పణ దేవాలయ ప్రవేశం, అష్టోత్తర శత కలశాభిషేకం (108 కలశాలతో) పంచామృత అభిషేకం, అలంకరణ తీర్థప్రసాద వితరణ జరుగును. మంగళవారం లక్ష కుంకుమార్చన, బుధవారం శ్రీచక్రనవావరణార్చన, శ్రీగంగానమ్మ అమ్మవారి జీవిత చరిత్ర ఆలపించడం జరుగుతుంది. అనంతరం అన్నసమారాధన, మే 1వ తేదీ గురువారం శ్రీపోతురాజు స్వామి వారికి, శ్రీకాలభైరవస్వామి వారికి క్షేత్రపాలక పూజ ఆరాధన జరుగును. 2వ తేదీ శుక్రవారం శ్రీ అశ్వద్ధ నాగలింగేశ్వర స్వామివారికి శాంతి రుద్రాభిషేకం నిర్వహిస్తారు.

నేడు వీఎంసీలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం వీఎంసీలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో, చిట్టినగర్‌లోని సర్కిల్–1 కార్యాలయంలో, సత్యనారాయణపురంలోని సర్కిల్–2 కార్యాలయంలో, పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లో జరిగే కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు, స్థానిక అధికారులు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారని ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని నగర వాసులు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కమిషనర్ సూచించారు.

టూరిజం సిబ్బందికి టోపీల వితరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) బోటింగ్ సిబ్బందికి కాంట్రాక్టర్ మన్నం కొండయ్య టోపీలను వితరణ చేశారు. వేసవి కాలంలో బోటింగ్ సిబ్బంది పడుతున్న ఇబ్బందులను గమనించిన ఆయన ఆదివారం భవానీపురంలోని హరిత బెరం పార్క్‌లోని బోటింగ్ పాయింట్ వద్ద మేనేజర్ నాగరాజుకు టోపీలను అందజేశారు. ఈ సందర్భంగా బోటింగ్ సిబ్బంది కొండయ్యకు ధన్యవాదాలు తెలియజేశారు.

రామలింగేశ్వర ఆలయంలో విశేష పూజలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చైత్ర అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం భీమనవారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, నాగ పవన్‌కుమార్ శర్మల పర్యవేక్షణలో రామలింగేశ్వర స్వామికి పంచామృత అభిషేకాలు, ఏకాదశ రుద్రాలతో అభిషేకాలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో యాగశాలలో మండపారాధన, గణపతి పూజ, చండీహోమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

సుధాకర్ కవిత్వం సామాజిక అంశాల సమాహారం

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్



కవితా సంపుటి ఆవిష్కరణ సభలో శివశంకర్, మాధవరావు, పలమనేరు బాలాజీ తదితరులు

విజయవాడ కల్చరల్: లోసారి సుధాకర్ కవిత్వం సామాజిక అంశాల సమాహారమని కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. సుధాకర్ వచన కవితా సంపుటి 'ఆయుధం లాంటి మనిషి' పుస్తకాన్ని హోటల్ ఐలాపురంలో ఆదివారం ఆవిష్కరించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన శివశంకర్ మాట్లాడుతూ ఆయుధంలాంటి కవి సుధాకర్ అని అభివర్ణించారు. సుధాకర్ కవిత్వంలో సామాజిక స్పృహ కనిపిస్తుందన్నారు. కవికి ఉండాల్సిన ప్రధానమైన అంశం సామాజిక పరిశీలన అన్నారు. కవి బండ్ల మాధవరావు మాట్లాడుతూ కవికి సమాజ పరిశీలన అవసరమన్నారు. కవిలో భావవ్యక్తీకరణ కనిపిస్తుందన్నారు. ఆవిష్కరణ సభలో తిరుపతికి చెందిన కథా రచయిత పలమనేరు బాలాజీ, విశ్రాంత అధ్యాపకుడు మధురాంతకం నరేంద్ర, కవయిత్రి మందరపు హైమావతి, సాహితీవేత్తలు మేడేపల్లి శివశంకర్, జీ వెంకటకృష్ణ, కేపీ అశోక్‌కుమార్ సుధాకర్ కవిత్వంలోని వివిధ అంశాలను గురించి మాట్లాడారు. కవి సుధాకర్ మాట్లాడుతూ తన కవిత్వానికి ప్రేరణ చుట్టూ ఉన్న సమాజమేనని.. అదే తన కవితా వస్తువని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాల్యం నుంచే గ్రంథాలయాలపై ఆసక్తి పెంపొందించాలి



గ్రంథాలయ విజ్ఞానం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, మాజీ ఎమ్మెల్సీలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): బాల్యం నుంచే పిల్లలు, విద్యార్థులకు చదువు, భాష, విజ్ఞానం పట్ల ఆసక్తి పెంపొందించాలని, గ్రంథాలయాలకు వెళ్లే విధంగా కృషి చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఇటీవల కాలంలో పట్టణాల్లో కంటే గ్రామాల్లో గ్రంథాలయాలు ఎక్కువ మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి రాజధాని ప్రాంతంలో త్వరలో చారిత్రక గ్రంథాలయ నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ విజ్ఞానం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బుద్ధప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ఆనాటి ప్రముఖులు గ్రంథాలయ ఉద్యమాన్ని నడిపారని, కానీ నేడు గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం నడపాల్సి వచ్చిందన్నారు. మాతృ భాషా వికాసం కోసం ఈ వేదిక కృషి చేయాలని, ప్రజలను గ్రంథాలయాలు, పుస్తక పఠనం వైపు నడపాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీలు బాలసుబ్రహ్మణ్యం, కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రంథాలయాల కోసం ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

గ్రంథాలయాలు అభివృద్ధి చేయాలి..

వేదిక అధ్యక్షుడు వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమం మొదలైన విజయవాడ కేంద్రంగా పునర్వికాస ఉద్యమం ప్రారంభమైందన్నారు. సమస్యలపై ప్రభుత్వానికి వినతి ఇవ్వడం, పరిష్కారానికి వత్తిడి చేయడం, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను, మేధావులను సమీకరించి ముందుకు సాగుతామని వివరించారు. కర్ణాటక, కేరళ, అమెరికాలో మాదిరిగా మన రాష్ట్రంలో గ్రంథాలయాలు అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. గ్రంథాలయ శాస్త్ర నిపుణులు రావి శారద, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీతలు పెనుగొండ లక్ష్మి నారాయణ, పాపినేని శివశంకర్, వెన్నా వల్లభరావు, దాసరి వెంకట రమణ,పి.సత్యవతి, మధురాంతకం రాజారామ్ మాట్లాడారు. సదస్సులో భాగంగా విద్యాసంస్థలు – గ్రంథాలయాలు, సాంకేతికయుగం – పుస్తకపఠన ఆవశ్యకత, జిల్లా గ్రంథాలయాలు – సమస్యలు – పునర్నిర్మాణం, పౌర గ్రంథాలయాలు – సాహిత్యం – ప్రాధాన్యత అనే అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఉద్యమ వేదిక నిర్వాహకులు లక్ష్మయ్య, వెంకట నారాయణ, మనోహర్ నాయుడు, జి.లక్ష్మి, కాట్రగడ్డ, స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడికి నిరసనగా ప్రదర్శన ర్యాలీ



పాయికాపురంలో కొవ్వొత్తుల ర్యాలీ

పాయకాపురం(విజయవాడరూరల్): జమ్మూ-కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ ఆదివారం రాత్రి స్పందన సేవా సమితి – స్పందన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాయకాపురంలోని డాక్టర్ వైఎస్సార్ పార్కులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దాడిలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా స్పందన సేవా సమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మతోన్మాదంతో జమ్మూ-కాశీర్‌లో జరిగిన ఉగ్రదాడి హేయమైన చర్య అని అన్నారు. ఉగ్రవాదంతో భారతదేశ సమగ్రతను, సమైఖ్యతను, సార్వభౌమత్వాన్ని దెబ్బతీయలేరని పేర్కొన్నారు. మతోన్మాదం నశించాలి, దేశసమైఖ్యతను కాపాడాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో యోగా మాష్టారు కే నరసింహారావు, వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి డీ మురళీ, ట్రెజరర్ ఎస్ చెన్న కేశవ, విమలరాణి, భాగ్యలక్ష్మి, పెప్సి దుర్గారావు, ఆర్ ఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం కళావేదికపై నృత్య కళాకారిణి నేతి రిషిత పర్యవేక్షణలో 15 మంది చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. అమ్మవారిని దర్శించుకుని కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాన్ని వీక్షించి వారిని అభినందించారు. నృత్య ప్రదర్శన అనంతరం శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.